

A Very Well-Acclaimed Aauthor Of
Two English Novels
**"The Enemy of the Mankind" and**
**"The Dictator of the Dark"**

# సూర్యదేవర రామ్ మోహన రావు

**AUTHOR OF HIGHEST NUMBER OF NOVELS IN TELUGU**



# అజేయుడు

# అజేయుడు

సూర్యదేవర రామమోహనరావు

# అజేయుడు

**-సూర్యదేవర రామ్‌మోహనరావు**

టేబుల్ మీద ఫోన్ నిశ్శబ్ధాన్ని భగ్నం చేస్తూ మ్రోగింది.

రిటైర్డ్ పోలీస్ కమీషనర్ బలరామ్ ఎత్తాడు.

అవతలి వైపు నుండి- "నమస్తే సార్...!" అన్న కంఠస్వరం.

"ఎవరూ?" అని అన్నాడు బలరామ్.

"విశాఖ నర్సింగ్ హోమ్ నుంచి డాక్టర్ జ్వాలా నరసింహరావు."

"వాట్ మిస్టర్ జ్వాలా... ఏమిటి విశేషం...?" ఏ వార్త వినాల్సొస్తుందో అన్న భరించలేని ఉద్విగ్నతతో అన్నాడు.

"అర్జంటుగా మీరు రాగలరా...?" డాక్టర్ కంఠంలో అభ్యర్ధన, దాని వెనుక ఆందోళన...

"ఏమిటి...? ఏం జరిగింది...?" తనను తాను కంట్రోలక్ష చేసుకుంటూ అన్నాడు బలరామ్. ఏదో జరగకూడనిదేదో జరిగిందని అతని సిక్స్‌సెన్స్ చెబుతోంది.

"మౌక్తిక కండిషన్ సీరియస్‌గా వుంది... మీరు వెంటనే రావాలి."

ఆ మాట వినగానే బలరామ్ వళ్ళంతా చమటపట్టినట్లు అయింది. మౌక్తికకు ఏమైనా జరిగితే... ఆయన గుండె ఆగిపోతుంది.

అప్రయత్నంగానే... ఫోన్ పెట్టేసాడు.

ఆయన అణువణువులో టెన్షన్...

చటుక్కున సీట్లోంచి లేచి గబగబా బయటకు నడిచాడు.

ఎదురుగా వినోద్ వస్తూ.... హడావుడిగా వెళుతున్న బలరామ్‌ని చూడగానే ఏదో జరిగివుంటుందని భావించి... "సార్! ఎక్కడికీ...?" అని ఆదుర్ధాగా అడిగాడు.

అతని మాటలకు బదులివ్వకుండా సీరియస్‌గా ముందుకెళ్ళిపోతున్నాడు బలరామ్... వినోద్‌కు ఆశ్చర్యమేసింది ఆయన ప్రవర్తన.

గత నెల రోజులుగా బలరామ్ ప్రవర్తనలో ఒకింత తేడా కన్పిస్తోంది. అదేమిటో తెలుసుకోవాలి...

వినోద్ బయటకు నడిచాడు...

అప్పటికే ఆయన కారు గేటు దాటుతోంది...

సాలోచనగా తల పంకించాడు వినోద్...

రిటైర్ అయిన తరువాత ఇంటర్‌పోల్ డిటెక్టివ్ ఏజెన్సీలో చీఫ్ డైరెక్టర్‌గా జాయిన్ అయ్యాడు బలరామ్. బలరామ్‌ని పిలిచి ఆఫర్ యిచ్చిన సంస్థ.... ఇంటర్‌పోల్ డిటెక్టివ్ ఏజెన్సీ.

✦ ✦ ✦ ✦

విశాలమైన హాస్పిటల్ కారిడార్స్‌లో అతి వేగంగా నడుస్తున్నాడు బలరామ్.

ఆయన ముకంలో ఆందోళన...

విశాఖా నర్సింగ్ హోమ్... నగరంలో అద్భుతమైన నర్సింగ్ హోమ్.

అపోలో, యశోదా, కేర్, మెడినోవాల్లా కార్పొరేట్ హాస్పిట్ కాదది... అది ఘంటా జ్వాలా నరసింహరావు స్వంత ఇన్‌స్టిట్యూట్... దాదాపు అపోలోలాంటి ఫైవ్‌స్టార్ హాస్పిటల్స్‌లో దొరికే అన్ని రకాల ట్రీట్‌మెంట్స్ అక్కడ దొరుకుతాయి.

కంప్యూటరైజ్డ్ స్కానింగ్ యూనిట్... సిటీ స్కానింగ్ యూనిట్, కంప్యూటరైజ్డ్ ఆక్సిలోటో ప్రోగ్రఫీ... కంప్యూటరైజ్డ్ ఆపరేషన్ యూనిట్....

అవసరమైతే ఎక్కడికెళ్ళయినా ఆపరేషన్ చేయటానికి వీలుగా మొబైల్ ఆపరేషన్ యూనిట్స్ కూడా వున్నాయి.

అర్టిస్టోక్రాటిక్ సొసైటీకి సంబంధించినవాళ్ళే కాక.... మిడిల్ క్లాస్ వాళ్ళకు కూడా అందుబాటులో వుండే నర్సింగ్ హోమ్ అది.

బలరామ్ వెళ్ళేసరికి డాక్టర్ జ్వాలా ఆయన కోసం ఎదురు చూస్తున్నారు.

"వాట్ డాక్టర్ ఏం జరిగింది... చెప్పండి?" ఆందోళనగా అడిగాడు బలరామ్. ఆయన కళ్ళలో బాధా, ఆందోళన గూడుకట్టుకుని వున్నాయి.

"మౌక్తిక పరిస్థితి చాలా సీరియస్‌గా వుంది."

డాక్టర్ జ్వాలా లేచి నిలబడి– "నాతో రండి" అంటూ బయటకి నడిచాడఊ.

బలరామ్ గుండెల్లో అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయి. ఏం మాట్లాకుండా మౌనంగా కారిడార్‌లో అతి వేగంగా నడుస్తున్నాడు డాక్టర్ జ్వాలా.. అతని వెనుకే బలరామ్.

ఇద్దరూ ఓ స్పెషల్ రూమ్‌లోకి నడిచాడు.

ఆ గది నీలి వెలుతురు ఆక్రమించినట్టు డిమ్‌గా వుంది. ఆ నీలి వెలుతురుల మధ్య ఓ బెడ్... ఆ బెడ్ మీద ఓ యువతి.

ఆమెకు పాతికేళ్ళుంటాయి... అతి బలహీనంగా వుంది ఆమె శరీరం... ఆమె ముఖంలో అలసట దేనికోసమో వెతికి వెతికి... అలసిపోయినట్లు అనిపిస్తోంది.

ఆమెను చూడగానే బలరామ్ ముఖంలో బాధ, ఆవేదన. ఆయన హృదయం ఒక్కసారిగా ద్రవించిపోయింది. ఆయన కళ్ళల్లో నీళ్ళు...

“డాక్టర్! ఏం జరిగింది..?”

అక్కడవున్న కేస్ రిజిష్టర్‌ని బలరామ్ ముందుపెట్టాడు జ్వాలా.

ఒణుకుతున్న చేతుల్తో ఆ కేసు రిజిష్టర్ తీసుకున్నాడు.

ప్రముఖ న్యూరోసర్జన్ బాలపరమేశ్వర్ యిచ్చిన రిపోర్ట్ అది. బాల పరమేశ్వర్ భారతదేశంలో పేరెన్నికగన్న ప్రముఖ న్యూరోసర్జన్. ఆయన న్యూరోసర్జన్‌లోనే కాదు... సైక్రియాటీలో కూడా ఎక్స్‌పర్ట్... సైకో ఎనాలసిస్ స్పెషల్ సబ్జెక్ట్‌గా చదివాడు ఆయన.

న్యూరోసిస్, స్కిజో ఫోర్నియా... అబ్సెసివ్ న్యూరోసిస్ మొదలైన వాటిమీద ఆయన చేసిన పరిశోధనలకు భారత ప్రభుత్వం గత సంవత్సరమే ఆయనకు పద్మశ్రీ బిరుదును ప్రధానం చేసింది.

చటుక్కున బలరామ్ చేతిలోకి కాగితం క్రిందకు జారింది.

“షీ ఈజ్ సఫరింగ్ విత్ అబ్సెసివ్ న్యూరోసిస్... అతి త్వరలో స్కిజోఫోర్నియాలోకి మారిపోతుంది. అలా మారటానికి అతి తక్కువ కాలమే వుంది. అది నెలల కావచ్చు... రోజులు కావచ్చు... గంటలు కావచ్చు. ఈలోపలే ఈ అబ్సెసివ్ న్యూరోసిస్ నుంచి బయటపడాలంటే ఒకటే మార్గం....”

డాక్టర్ జ్వాలా చెపుతున్నాడు, బలరామ్ వింటున్నాడు.

సెడెటిన్ మత్తులోకి జారిన మౌక్తిక ఆయన కళ్ళకు ఓ విషాద గీతంలా, అందం, ఆహ్లాదం కోల్పోయిన అప్సరసలా కనిపిస్తోంది.

ఇంతలో నర్స్ వచ్చింది...

“ఇప్పటివరకూ విపరీతంగా గొడవచేస్తే మార్ఫిన్ యిచ్చాను డాక్టర్.”

“మౌక్తిక గొడవ చేసిందా?” ఆశ్చర్యంగా అన్నాడు బలరామ్.

డాక్టర్, బలరామ్‌ని బయటకు రమ్మని సైగ చేసాడు.

బలరామ్ బయటకు నడిచాడు.

కారిడార్‌లో నిలబడి దూరంగా కనిపిస్తున్న చెట్లవంక చూసాడు బలరామ్.

అతని వెనుక డాక్టర్ జ్వాలా...

"మిస్టర్ బలరామ్! పరిస్థితి నా చెయ్యి దాటిపోయింది..." నిట్టూరుస్తూ అన్నాడు డాక్టర్ జ్వాలా.

అది వింటూనే డీప్ షాక్‌లో కూరుకుపోయాడు బలరామ్.

"రక్షించాలంటే ఒకటే మార్గం..." ఒక్క క్షణం ఆగాడు డాక్టర్.

బలరామ్ శక్తినంతా కూడదీసుకుని డాక్టర్ ఏం చెప్తాడోనని ఎదురుచూడసాగాడు.

"వెంటనే రాజీవ్‌ను తీసుకువస్తే తప్ప మౌక్తిక బ్రతకదు."

"రాజీవ్‌ను చూస్తే తప్ప ఆమెకున్న అబ్సెసివ్ సైకో న్యూరోసిస్ సంపూర్ణంగా తగ్గుముఖం పట్టదు."

నెత్తిమీద బాంబు పడ్డట్టు ఉలిక్కిపడ్డాడు బలరామ్.

"ఈ పరిస్థితుల్లో రాజీవ్‌ని తీసుకురావటం అసంభవం డాక్టర్."

"రాజీవ్‌ని చూడకుండా ఆమె బ్రతకదు... ఆమె ఆశలకు, కలలకు సెంటరాఫ్ గ్రావిటీ రాజీవ్... రాజీవ్ లేని జీవితం ఆమెకు శూన్యం... ఆమె అతను లేకుండా, అతన్ని చూడకుండా బ్రతకదు..."

బలరామ్ గుండెల్లో గెలాక్సీలు విస్ఫోటనం చెందినట్లు మనిషి ఆపాద మస్తకం కదిలిపోయాడు.

✦ ✦ ✦ ✦

There is always a criminal who believes, he can get away with his crimes-the perfect poison that leaves no trace, the murdered body so easily disposed of-but the tiniest clue will be quite enough fot the forensic expert.

Vital evidence can be deduced from a blood stain or a finger print, a scrap of paper, The chips of paint from a car, Or gleaned from sophisticated electronic equipment like voice machines and lie detectors. These are the methods of crime busting used by the F.B.I. Scotland and Interpol.

But in India

when.....?

ఇండియాలో చట్టాలు వున్నట్టుగానే అనిపిస్తాయి... అవి అమలు పరుస్తున్నట్టుగానే అనిపిస్తుంది. కానీ... డబ్బు, అధికారం దండిగా వున్నవాళ్ళు దండన లేకుండానే ఒడ్డున పడిపోతుంటారు.

ఎందరో మంత్రులు... మాజీ ముఖ్యమంత్రులు... వందల వేలకోట్లు వెనకేసుకున్నా... వాళ్ళకి ఏ శిక్షలూ పడవు. వాళ్ళ ఆస్తులు జప్తుకావు.

ఇక్కడ ఎన్ని చట్టాలు వున్నా... హత్యలూ, మానభంగాలు, దౌర్జన్యాలూ, దహనకాండలూ, కబ్జాలు యధేచ్ఛగా జరిగిపోతూనే వుంటాయి.

డబ్బూ, అధికారం వుంటే ఏ తప్పయినా చేయొచ్చు... ఎలాగైనా బయటపడొచ్చు!

కనుక ఎవరు ఏ తప్పయినా చేయవచ్చు అనే ఆలోచన ప్రజల మెదళ్ళలోకి చొచ్చుకుపోతే... ఈ జాతి ఏ దిశగా నడుస్తుంది? దిశానిర్దేశం ఈ ఆలోచనలతో వూపిరి పోసుకుంటే... దేశాభివృద్ధి ఏమయిపోతుంది?

✦ ✦ ✦ ✦

అతను మౌనంగా వున్నాడు.

అతని ఎదురుగా జైలు గోడలు... అతని చుట్టూ జైలు గోడలు.. అతని మనసులో అంతులేని జైలు గోడలు!!! అతను మాట్లాడడు... ఉలకడు... పలకడు... అతనిలోని ఆలోచనలు... తీవ్రమైన ఆలోచనలు..!! దేనిగురించో... ఎవరి గురించో... ఎందుకో.... తెలియదు.

కానీ అక్కడున్న వాళ్ళందరికీ తెల్సింది ఒక్కటే!

ఆగష్టు 14 సూర్యోదయాన్ని అతను చూడడు... ఆ రోజు ఉదయం అతన్ని ఉరి తీస్తారు.. అందుకే అతనెవరితో మాట్లాడడు. అతనో యోగిలా నాలుగు జైలు గోడల మధ్య వున్నాడు.

అతను కళ్ళు పైకెత్తాడు.. అతని చూపులు ఎదురుగా వున్న గోడ మీద పడ్డాయి... అక్కడ బొగ్గుతో రాసి వుంది... ఆగష్టు 14వ తేదీ అని–

ఆ 14వ తేదీన కొట్టవేస్తూ ఇంటూ మార్క్... ఆ ఇంటూ మార్కు వెనక ఓ ముఖం.

ఆ ముఖానికి ఆకృతి లేదు.. రూపం లేదు... రంగు లేదు... ఆ ఆకృతికి అసలు జీవం లేదు...

కానీ! ఆ ముఖం ఎవ్వరిదో అతనికి తెలుసు. ఆ ముఖం అతనిది!

అతని పేరు జయప్రకాష్.

ఆ రోజు ఆగస్టు – 10.

ఆగష్టు–14 యింకా నాలుగు రోజులుంది.

అతని గుండె ఆగిపోవడానికి యింకా 84 గంటల సమయం వుంది.

✦ ✦ ✦ ✦

"ఈ పరిస్థితిల్లో రాజీవ్‌ను తీసుకురావడం అసాధ్యం, అసంభవం." ఎగ్జైయిటింగ్‌గా అన్నాడు బలరామ్.

అతని కళ్ళు వర్షిస్తున్నాయి.

అతని వంక నిశ్చలంగా నిర్వికారంగా చూసాడు డాక్టర్ జ్వాలా.

"రాజీవ్‌ను చూడకపోతే ఆమె బ్రతకదు."

"ఎలా...? ఎలా డాక్టర్?" అతని శరీరం వణుకుతోంది. "డాక్టర్... నా మౌక్తిక బ్రతకదా?"

ఆ ప్రశ్నలో ఓ కన్నతండ్రి ఆక్రోశం ప్రతిధ్వనిస్తోంది.

"ఇట్స్ హైలీ యింపాజిబుల్ మిస్టర్ బలరామ్" రాజీవ్‌ను చూడకపోతే ఒక్క వారంలో ఆమె పిచ్చిదైపోతుంది. ఆ తరువాత లూనటిక్ స్టేజ్... ఆమె ఏమైపోతుందో ఊహాతీతం"

"డాక్టర్... నాకర్థమయ్యేటట్లు చెప్పండి..." వణికిపోతూ అడిగాడు బలరామ్.

"ఎక్స్‌ట్రీమ్ లూనటిక్ స్టేజ్‌లో పేషెంట్ తనను తాను చంపుకోవచ్చు, లేదా ఎదుటివాళ్ళను చంపొచ్చు... లేదా డీప్ కోమాలోకి వెళ్ళవచ్చు... తీవ్రమైన ఆలోచనలతో సెరిబ్రల్ హెమరేజ్ కూడా ఎటాక్ కావచ్చు..."

"ఎలా డాక్టర్... నా మౌక్తిక బ్రతకాలి... ఎలా...?" ఆవేదనగా అడిగాడు బలరామ్.

"ఆ ఎక్స్‌ట్రీమ్ లూనటిక్ స్టేజ్ పేషెంట్ తనకు అందుబాటులో వుండే ఏ ఆయుధంతోనైనా సరే... కరెంట్ ప్లగ్‌లో చెయ్యిపెట్టి ప్రాణం తీసుకోవచ్చు. లేదా మేడ మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవచ్చు. ఎవ్వరూ లేనప్పుడు దుప్పటితో ఫ్యాన్‌కు ఉరి బిగించుకొని..."

"స్టాపిట్... స్టాపిట్..." విపరీతంగా ఎగ్జయిట్ అయిపోతూ అరిచాడు ఇంటర్‌పోల్ డైరెక్టర్ బలరామ్.

ఆయన కళ్ళలో తీవ్రమైన ఆందోళన... భయం...

"అయితే మౌకిక్తను రక్షించే అవకాశమే లేదా?"

"ఉంది...."

"ఏమిటది?"

"రాజీవ్‌ని తీసుకురావటం."

"ఇట్స్ ఇంపాజిబుల్ డాక్టర్."

"ఇట్ మస్ట్ బీ పాజిబుల్... ఆలోచించండి... మీరు... కమీషనర్ ఆఫ్ పోలీస్‌గా ఎంతోకాలం వర్క్ చేసారు. క్రిమినల్స్ గురించి, క్రిమినాలజీ గురించి మీకు తెలుసు. ఆ క్రిమినాలజీ సహాయంతోనే రాజీవ్‌ని తీసుకురండి. మీరు తల్చుకుంటే రాజీవ్‌ని తీసుకురావటం యింపాజిబుల్ కాదు."

విభ్రాంతిగా చూసాడు బలరామ్.

డాక్టర్ జ్వాలా చిరునవ్వు నవ్వాడు.

ఆ నవ్వులో అతనికో సందేశం అంతర్లీనంగా స్ఫురించింది.

✦ ✦ ✦ ✦

ఇంటర్‌పోల్ డైరెక్టర్ బలరాం ఆలోచిస్తున్నాడు.

తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ఏం చెయ్యాలి?

రాజీవ్‌ని ఎలా తీసుకురావాలి?

బలరాం ఈ ఆలోచనల్లో వుండగా, ఆఫీస్‌లోకి అడుగుపెట్టాడు వినోద్. వినోద్ ఆయనకు చాలా నమ్మకపాత్రమైన అసిస్టెంట్.

బలరాం జీవితంలోని ఆటుపోట్లను, సుఖదుఃఖాలను, రాగద్వేషాలను కొంతలో కొంత ఆయనతోపాటు కలిసి పంచుకున్నాడు వినోద్.

ఒక విధంగా వినోద్‌ను పితృవాత్సల్యంతో చూస్తాడు ఆయన. స్ప్రింగ్ డోర్ తెరుచుకొని లోపలికి అడుగుపెట్టాడు వినోద్.

అతని అడుగుల చప్పుడు విని తల తిప్పి చూసాడు బలరాం. వినోద్‌ని చూడగానే చిరునవ్వు ఆయన పెదాల మీద వెలిసింది. కాని ఆ చిరునవ్వు ఆయనలోని టెన్షన్‌ను దాచలేకపోయింది.

“వినోద్” ఆయన పెదవులు కదిలాయి.

ఎంతో అసిపోయిన వాడిలా వున్నాడు బలరాం.

అప్పుడు చూసాడు వినోద్ ఆయనవైపు–

ఓ పెద్ద సమస్యతో తీవ్రంగా యుద్ధం చేస్తున్న యోధుడిలా వున్నాడు ఆ క్షణంలో బలరాం.

“సార్... నిన్నటి నుంచి మీరు మామూలుగా లేరు... ఆందోళనగా వున్నారు. కారణం ఏమిటి సార్?”

అప్యాయంగా అడుగుతున్న వినోద్ మాటలకు ఆయన కళ్ళల్లో తడి.

“కన్నీరా! ఎందుకీ ఆత్మీయతకు కరిగిపోతావ్!<br>
శరన్మేఘంటా గుండెల్లోంచి కళ్ళల్లో కురిసిపోతావ్”

ఎప్పుడూ ఎంతో నిబ్బరంగా, ధైర్యంతో– "ఈ ప్రపంచాన్ని జయిద్దాం పదండి" అన్నట్టు కన్పించే బలరామ్ నీరసంగా, నిస్తేజంగా తీవ్ర సమస్యతో పోరాడుతున్నట్లు కన్పిస్తున్నాడు.

"సార్.... ఏం జరిగింది సార్?" అడిగాడు తిరిగి.

"వినోద్...." ఆయన ఆగాడు.

"చెప్పండి సార్!"

"రాజీవ్... రాజీవ్ లేకపోతే మౌక్తిక బ్రతకదు... వినోద్ షీ యీజ్ బికమ్ మ్యాడ్, విత్ అవుట్ రాజీవ్..." ఛెళ్ళున కొరడాతో కొట్టినట్లు స్థంభించిపోయాడు వినోద్.

అతని కళ్ళముందు మౌక్తిక రూపం కదలాడింది.

✦ ✦ ✦ ✦

అతను నిర్వికారంగా వున్నాడు.

అతని ముఖం సన్నగా, పీలగా వుంది.

ఆ ముఖంలో కళ్ళు మాత్రం అతి తీక్షణంగా వున్నాయి. ఆ కళ్ళలో కనిపించని దూర తీరాలు... అతను జైలు రూఫ్ వంక చూస్తున్నాడు. అక్కడ అతనికేం కన్పిస్తుందో ఎవ్వరికీ తెలీదు. అతను ఆ జైల్లోకొచ్చి మూడు నెలలైంది... మూడు నెలల నుంచి ఎవ్వరితో ఏమీ మాట్లాడింది లేదు.

చెప్పిన పని చేస్తాడు. అతనో అర్థంకాని పజిల్, జైల్లో వున్న వాళ్ళకు అతనో పెద్ద క్వశ్చన్‌మార్క్...

ఈ మూడు నెలల్లో అతను ఏడవటం కానీ, నవ్వటం కానీ చూసిన వాళ్ళు ఎవరూ లేరు.

అతను అనాథ... అతని కెవ్వరూ లేరు!

ఎప్పుడు చూసినా నిర్వికారంగా వుండే కళ్ళు... ఏ భావం వ్యక్తపరచని ముఖం...

అతను బ్రతికున్న మనిషిలా లేదు!

అన్నం పెడితే తింటాడు. పెట్టకపోతే మౌనంగా వుంటాడు.

అతన్ని పలకరించటానికి మిగతావాళ్ళు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

అతనికి ఉరిశిక్ష విధించారని, ఆగష్టు 14వ తారీఖు అతన్ని ఉరి తీస్తున్నారని మిగతా ఖైదీలకు తెలుసు. ఖైదీలందరూ అతన్ని జాలిగా, సానుభూతిగా చూసేవారు.

అతను వాటినేమీ పట్టించుకోలేదు.

అతను చేస్తున్న పని ఒక్కటే–

గోడమీద బొగ్గుతో ఆ రోజు డేట్ వేయటం! దాని వంకే సీరియస్‌గా చూడటం! ఆ రోజు కూడా గోడ మీద గీశాడు ఆగష్టు 11 అని...

అతని మరణం ఇంకా "60" గంటలు.

రాబోయే మృత్యువు గురించి అతను బాధపడటం లేదు. అతను నిమిష నిమిషం మృత్యువు కోసం ఎదురుచూస్తున్నాడు.

అతని జీవితంలో మిగిలిన అరవై గంటలు, అతనికి అత్యంత దుర్భరంగా...

ఒక్కో నిమిషం ఒక్కో రోజులా....

ఆ అరవై గంటలూ అతనికి మరో జీవితంలా అత్యంత భారంగా వున్నాయి.

అతను.... జయప్రకాష్....!

✦ ✦ ✦ ✦

"రాజీవ్‌ని తీసుకురావాలంటే ప్రాణాల్ని కూడా త్యజించటానికి సిద్ధపడే మాగ్నిఫిషియంట్ పర్సన్ కావాలి వినోద్..." ఆగాడు ఆయన.

"ప్రత్యర్థుల గుండెల్లో బాంబుల కురిపించగల ఎక్స్‌ట్రిమిస్టే మాత్రమే ఈ ఎస్పైన్‌మెంట్‌కు అర్హుడు... అలాంటి వ్యక్తి ఎవరు వినోద్?"

ఆ గదిలో నిశ్శబ్దం అలుముకొంది.

వినోద్ ముఖంలో నిర్వికారం. ఆలోచనలు దాటిన అతీతస్థితి! అతను తీవ్రాలోచనలో వున్నాడు. హఠాత్తుగా ఆ నిశ్శబ్దాన్ని బద్ధలుచేస్తూ వినోద్ అన్నాడు– "కృష్ణభగవాన్ రాజీవ్‌ను తీసుకువచ్చే ఆపరేషన్‌లో మీకు సహాయపడవచ్చు."

బలరామ్ వినోద్ వంక సీరియస్‌గా చూసాడు.

"కృష్ణభగవాన్ ప్రొఫెషనల్ కిల్లర్... రాజీవ్‌ని తీసుకువచ్చే విషయంలో అతను రిస్క్ చేయలేడు. రాజీవ్‌ని తీసుకురావాలనే బలమైన మోటివ్‌ఫోర్స్ అతనిలో వుండదు. హీ ఈజ్ సింప్లీ ఎ ప్రొఫెషనలిస్ట్... మనుష్యుల్ని దొంగచాటుగా చంపడంలో అతనో ఎక్స్‌పర్ట్.... జస్ట్ అంతే. కృష్ణభగవాన్ ఈజ్ నాట్ ఈక్వల్ టూ యుగంధర్ స్ట్రాటజీ అండ్ ప్లానింగ్. కృష్ణభగవాన్ యుగంధర్‌ని ఎట్టి పరిస్థితుల్లో ఎదుర్కోలేడు."

వినోద్ ముఖం గంభీరంగా మారింది.

బలరామ్‌కి అత్యంత ఆత్మీయుడు వినోద్.

బలరామ్ కమీషనర్‌గా వున్నప్పుడు వినోద్ పోలీస్ ఇన్‌ఫార్మార్. క్రిమినల్ అండర్‌వరల్డ్ గురించి పరిపూర్ణంగా తెలిసిన వ్యక్తి.

రిటైర్ అయిన తరువాత అతన్నే తన పర్సనల్ సెక్రటరీగా అపాయింట్ చేసుకున్నాడు.

హఠాత్తుగా వినోద్ లేచాడు.

"సార్! ఒక్క రెండు గంటల్లో మీ దగ్గరుంటాను. నా దృష్టి పథంలో ఓ వ్యక్తి వున్నాడు. ఆ వ్యక్తి దీనికి సమర్థుడో... అసమర్థుడో కన్‌ఫర్మ్ చేసుకొని వస్తాను. కాని...." అని ఆగాడు.

"వాట్ మిస్టర్ వినోద్?" ఆరుర్దాగా అడిగాడు బలరాం.

"కన్‌ఫర్మ్ అయినా అతను మనకు దొరక్కపోవచ్చు."

"ఎందుకని?" ఆత్రుతగా అడిగాడు బలరామ్.

"అతనికి ఉరి శిక్ష విధించారు...."

అణు విస్ఫోటనం తన ప్రక్కనే జరిగినట్లు విభ్రాంతిగా చూసాడు బలరామ్.

"రాజీవ్‌ని తను రక్షించలేడా?"

ప్రశ్న క్షణక్షణం పెరిగి పెద్దదై అతని ముందు ప్రశ్నార్థకంగా నిలిచింది.

✦ ✦ ✦ ✦

యుగంధర్!

కోల్డ్‌బల్డడ్ నొటోరియస్ మాఫియా బిజినెస్ టైకూన్!

యుగంధర్ పేరు చెప్తే ముంబై బిజినెస్ వరల్డ్‌లో సంచలంన... మనుష్యుల్ని నిర్ధాక్షిణ్యంగా, కర్కశంగా చంపటంలో అతన్ని మించినవారు లేరు.

హి ఈజ్ ఏ సైకో పాతిక్ క్రిమినల్!

అతను ఎన్నో హత్యలు చాలా సరదాగా చేసాడు.

ఇంగ్లాండ్‌లోని జాక్ ది రిప్పర్‌తో పోలిస్తే యుగంధర్ అతి భయంకరుడు... నీచుడు, జాలి, దయ లేని పాషాణుడు.

ఒక విధంగా చెప్పాలంటే- అతను పిశాచంలాంటి మనిషి!

ముంబై అండర్‌వరల్డ్‌లో తిరుగులేని మట్కాకింగ్!

మట్కాలో 'మనీ స్పిన్నింగ్' అనే కొత్త పద్ధతిని కనిపెట్టి, ట్రిబుల్ బ్రాకెట్‌ను ఓపెన్ చేసింది అతనే.

ట్రిబుల్ బ్రాకెట్ అంటే మూడు ఓపెనింగులు, మూడు క్లోజింగులు ఒకేసారి చెప్పటం– జాక్‌పాట్‌లా.

దీనికి రూపాయికి 18000 రూపాయల బెట్టింగ్ వుంటుంది.

ఈ ట్రిబుల్ బ్రాకెట్లోనే కోటానుకోట్ల రూపాయలు సంపాదించి, మాఫియా అండర్‌వరల్డ్‌లో అగ్రశ్రేణి టైకూన్‌గా గుర్తించబడ్డాడు యుగంధర్!

అటువంటి నొటోరియస్ క్రిమినల్ పర్యవేక్షణలో వున్నాడు రాజీవ్.

రాజీవ్‌ను అతని దగ్గరనుంచి తీసుకురావడం చాలా ప్రమాదకరమని బలరామ్‌తోసహా అందరికీ తెలుసు.

ఆ గదిలో వినోద్ సీరియస్‌గా దినపత్రికల్ని చదువుతున్నాడు.

లైబ్రేరియన్ అతడ్ని డిస్టబ్ చెయ్యటం ఇష్టంలేక ఆ గదిలో నుంచి బయటకు వెళ్ళిపోయాడు.

అది లైబ్రరిలో మ్యాగజైన్ కీపింగ్ రూమ్.

అక్కడ లైబ్రేరియన్‌తో వినోద్‌కి పరిచయం వుంది. అవసరమైనప్పుడు కావాల్సిన ఇన్ఫర్మేషన్ గేదర్ చేసుకుని వెళ్ళిపోతాడు.

ఉదయం ఎనిమిది గంటలకు వచ్చాడు వినోద్.

ఓ సంవత్సరం క్రిందటి పేపర్లన్నింటినీ దీక్షగా పరిశీలించసాగాడు. అతని శ్రమ ఫలించింది.

అతనిక్కావలసిన మేటర్ అతనికి దొరికింది.

ఆ మేటర్‌ని చదువుతూ నోట్స్ తయారుచేయసాగాడు. కాలం తెలియలేదు. అతను అలాగే వర్క్ చేసుకుంటున్నాడు. సాయంత్రం ఐదు గంటలైంది.

ఆరు.... ఏడు.... ఎనిమిది గంటలు... ఎనిమిది గంటలకు లైబ్రరీ క్లోజ్ చెయ్యాలి.

వినోద్ లేచాడు. అతను తయారుచేస్తున్న నోట్స్ వంక చూసుకున్నాడు. అతనికి సంతృప్తి లభించింది. బైటకి నడిచాడు

ప్రస్తుతం అతను గేదర్ చేసిన న్యూస్–

దేశం మొత్తాన్ని అట్టుడికించిన, దారుణమైన హత్యలు చేసిన జయప్రకాష్ గురించి–

ది మోస్ట్ రూత్‌లెస్ కిల్లర్ జయప్రకాష్ గురించి సమగ్రమైన సమాచారం సేకరించాడు.

✦ ✦ ✦ ✦

సమయం రాత్రి పదిగంటలు!

బలరామ్ జయప్రకాస్ గురించి వినోద్ రాసిన నోట్స్ చదువుతున్నాడు.

అతని ఎదురుగా వినోద్ కూర్చున్నాడు.

బలరామ్ కళ్ళు వినోద్ రాసిన పంక్తుల్ని తీక్షణంగా చదువుతున్నాయి.

జయప్రకాష్!

ది మోస్ట్ రూత్‌లెస్ కిల్లర్ ఆఫ్ ఆల్ టైమ్!

ముగ్గురు వ్యక్తుల్నీ, ఫణిచౌదరి అనే బిజినెస్ టైకూన్‌ను అతి నిర్ధాక్షిణ్యంగా చంపిన హంతకుడు.

1985లో ది టాపెస్ట్ ర్యాంకర్ ఇన్ ఐ.ఎ.ఎస్.

నెంబర్ వన్ ఇన్ సెలెక్టెడ్ గ్రూప్ టెన్ ఐ.ఎ.ఎస్. క్యాండిడేట్స్.

1985లో ఐ.ఎ.ఎస్. పరీక్షల్లో టాప్ ర్యాంకు సాధించిన భారతదేశ అత్యున్నత మేధావి జయప్రకాష్!

జయప్రకాష్ తండ్రి దేశం కోసం తన ప్రాణాల్ని త్యాగం చేసిన మిలటరీ పైలెట్ ఆఫీసర్ నవీన్.

భారతదేశానికి పాకిస్తాన్‌కి జరిగిన యుద్ధంలో పాకిస్తాన్ ఆయుధాగారం పైకి విమానంతో ఎటాక్ చేసి పాకిస్తాన్ అమ్మ్యునేషన్‌ను బ్లాస్ట్ చేసిన యోధుడు.

ఏ పరమవీరచక్ర బిరుదులు పొందకపోయినా

జయప్రకాష్ తల్లి జయప్రకాష్‌ని ఆదర్శ యువకుడిగా తీర్చిదిద్దింది. కాలేజీ చదువు, పరీక్షలు తప్ప మరో ప్రపంచం తెలియని జయప్రకాష్... ఒన్ ఆఫ్ ది రేర్ జీనియస్.

తండ్రి అంత గొప్పవాడు కావాలనే ఆశయస్ఫూర్తితో అతను చదివాడు.

కాలేజీ జీవితంలో వుండే న్యూసెన్స్ అంటకుండా, బురద గుంటలో పద్మంలా తననుకున్న లక్ష్యం కోసం అహోరాత్రులు శ్రమించి ఐ.ఎ.ఎస్. పాసయ్యాడు.

అదే అతను తన తల్లికిచ్చిన పరమవీరచక్ర అవార్డుకన్నా అత్యుత్తమైన అవార్డు.

ముస్సోరిలో ట్రైనింగ్ పూర్తికాగానే–

అతన్ని కర్ణాటక డివిజన్‌కు ఎలాట్ చేశారు.

మొట్టమొదటిసారి గవర్నమెంట్ అతన్ని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అడల్ట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో కర్ణాటక ప్రభుత్వం నియమించింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Ajeyudu+Navala](http://kinige.com/book/Ajeyudu+Navala)**

* * *